గాలివీడుకు నీరిచ్చాకే వెలిగల్లు జలాల మళ్లింపు : మంత్రి మండిపల్లి

గాలివీడు, న్యూస్‌టుడే: వెలిగల్లు జలాశయం నీటిని గాలివీడు మండలంలోని అన్ని గ్రామాలకు అందించిన తరువాతే ఇతర ప్రాంతాలకు మళ్లిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. గాలివీడు మండలం గోపనపల్లెలో మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును మంత్రి కోసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెలిగల్లు జలాశయం లక్ష్యం నెరవేరేలా అభివృద్ధి పనులను ప్రణాళికబద్ధంగా పూర్తిచేస్తామన్నారు. గాలివీడును ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. అర్హులకు పింఛన్లు అందిస్తామన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన మంత్రి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కొండయ్య, నాయకులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మహమ్మద్‌రియాజ్, వెంకటరమణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రవీంద్రబాబు, లక్ష్మమ్మ, వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కేకు కోస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వేదికపై అధికారులు, నాయకులు

ఆలస్యంగా నడిచిన రైలు

ములకలచెరువు, న్యూస్‌టుడే : తిరుపతి నుంచి పీలేరు, వాల్మీకిపురం, మదనపల్లె, ములకలచెరువు మీదుగా గుంతకల్లు వెళ్లే ప్యాసింజర్ రైలు రెండున్నర గంటలు ఆలస్యంగా నడిచింది. సోమవారం రాత్రి తిరుపతి నుంచి గుంతకల్లు వెళ్లే రైలు ములకలచెరువుకు అర్ధరాత్రి 1.49 గంటలకు రావాల్సి ఉండగా, తెల్లవారుజామున 4.20 గంటలకు వచ్చింది. సుమారు రెండున్నర గంటలకు పైగా ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ములకలచెరువు నుంచి గుంతకల్లు వెళ్లే ప్రయాణికులు సైతం ఇబ్బందులు పడ్డారు.

ఈనాడు అన్నమయ్య

బుధవారం సెప్టెంబరు 25, 2024

మాటల్లో అభిమానం... చేతల్లో అపకారం!

– ఈనాడు, కడప

వైకాపా హయాంలో ఎస్సీ, ఎస్టీలపై వేధింపులు

రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉమ్మడి కడప జిల్లా

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ వెల్లడి

నా ఎస్సీ... నా ఎస్టీ అంటూ గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ తీసిన రాగం వెనుక ఆ సామాజికవర్గాల ఎదుగుదలను దెబ్బతీసే దురాలోచన దాగి ఉందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత నివేదికతో మరోసారి స్పష్టమైంది. వైకాపా అధినేత జగన్ అయిదేళ్ల ఏలుబడిలో జరిగిన దమనకాండను ఈ నివేదిక వెల్లడించింది. రాష్ట్రంలో ఉమ్మడి కడప జిల్లా అగ్రస్థానంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. గత వైకాపా పాలనలో జిల్లా చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఎస్సీ, ఎస్టీలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయి. ఇందుకు నిలువెత్తు సాక్ష్యమే కేంద్రం వెల్లడించిన తాజా నివేదిక. ఇందుకు ఎన్నో ఉదంతాలు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

◆ తనను తాను దళిత, గిరిజన బాంధవుడిగా అభివర్ణించుకున్న జగన్ తన పాలనలో అణగారినవర్గాలపై తరచూ దారుణమైన దమనకాండ కొనసాగించారు. 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ' అంటూ దళిత, ముస్లిం వర్గాల దీనస్థితిని ఉపయోగించుకుంటూ... ఆయన హయాంలో ఆయా వర్గాల బాధితుల సంఖ్య భారీగా ఉండడం గమనార్హం. బాధితులకు పోలీస్‌స్టేషన్లలో న్యాయం జరగకపోగా, ఆపై వారే తప్పుడు కేసులు సైతం ఎదుర్కోవాల్సి వచ్చింది. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ... గతంలో పులివెందుల ప్రాంతంలో దళితురాలు హత్య జరగ్గా.. ఆమె కుటుంబాన్ని పరామర్శించడానికి రాగా, అప్పట్లో ఆమెపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం విశేషం. ఇప్పటికీ ఆ కేసు కడప కోర్టులో నడుస్తోంది.



దళిత ఎమ్మెల్యే నియోజకవర్గంలోనే...

బద్వేలు నియోజకవర్గానికి దళిత ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రాతినిధ్యం వహిస్తున్నా.. ఆ సామాజిక వర్గానికిచెందిన జయన్నపై వైకాపా నేతలు విచక్షణారహితంగా గతంలో దాడి చేశారు. పొలంలో సాగునీటి పైపులైన్లు అమర్చుకునే విషయంలో చోటు చేసుకున్న వివాదం దాడికి దారితీసింది. అట్లూరు మండలం దిన్నెమీదపల్లెకు చెందిన జయన్నకు గ్రామ సమీపంలో పొలాలున్నాయి. పంటకు నీటిని పారించడానికి ఏర్పాటు చేసిన పైపులను పక్కనున్న మణ్యంవారిపల్లెకు చెందిన వైకాపా నేతలు వాడుకుంటున్నారు. పైపులు వాడుకోవడాన్ని జయన్న ఆక్షేపించడాన్ని వైకాపా నేతలు జీర్ణించుకోలేక దాడికి పాల్పడ్డారు.

బాధితులపైనే కేసుల నమోదు

రాజంపేట మండలం కొమ్మివారిపల్లి ఎన్టీఆర్ కాలనీలో భూ ఆక్రమణలపై రెవెన్యూశాఖాధికారులకు ఫిర్యాదు చేశారన్న కక్షతో వైకాపా నేత, ఆయన అనుచరులు ఎస్సీ వర్గానికి 10 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. కాలనీలో 47 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. తెదేపా ప్రభుత్వ హయాంలో 16 మంది ఎస్సీలకు నివాస పట్టాలిచ్చారు. వైకాపా అధికారంలోకి వచ్చాక.. ఆ భూమిపై ఉమ్మడి కడప జిల్లా ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడి కన్నుపడింది. స్థలం ఆక్రమించి అందులో నివాసాలు నిర్మించి ఇతరులకు అమ్మేశారు. ఈ విషయమై అదే గ్రామంలోని ఎస్సీలు పలువురు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్రమానికి పాల్పడిన వ్యక్తికి నోటీసులిచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామ వైకాపా నేతలు మాపైనే ఫిర్యాదు చేస్తారా?.. అంటూ కర్రలు, ఇనుప రాడ్లతో ఎస్సీలపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు.

కడపలో దళిత అధికారి హత్య

కడప పశువైద్యశాల డీడీ అచ్చెన్న హత్యకు గురయ్యారు. కడప నగర నడిబొడ్డు నుంచి అపహరించి హత్య చేసి గువ్వలచెరువు కనుమ రహదారి పక్కన పడేశారు. వారం రోజుల అనంతరం పశువుల కాపర్లు గుర్తించి సమాచారమివ్వడంతో నేరం వెలుగు చూసింది. అంతకుముందు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసినా సకాలంలో స్పందించకపోవడంతో నేరం జరిగింది. హత్యకేసు రాష్ట్రంలో సంచలనం కలిగించింది.

భూదందాలూ నేరాలకు కారణం

ఉమ్మడి కడప జిల్లాలో సాగిన భూదందాలు నేరాలు పెరగడానికి కారణమయ్యాయి. ఎస్సీ, ఎస్టీల భూముల ఆక్రమణకు వారిపై వేధింపులు అధికమయ్యాయి. కాశినాయన మండలం సావిశెట్టిపల్లెలో ఎస్సీల భూములను ఆక్రమించారు. సుమారు 40 కుటుంబాలకు చెందిన 63 ఎకరాల భూమిని కాజేశారు. సీకే దిన్నె మండలం మద్దిమడుగు సుగాలిబిడికి గ్రామానికి చెందిన రాజానాయక్ 5.14 ఎకరాల భూమిని వైకాపా హయాంలో చక్రం తిప్పిన కీలక నేత కాజేశారు. ఇలాంటివి ఎన్నెన్నో ఘటనలు చోటుచేసుకున్నాయి.

జగన్ ఇలాకాలోనూ దారుణం

సీఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరుకు చెందిన దళితుడు కృష్ణయ్య దారుణ హత్యకు గురయ్యారు. బొగ్గుల బట్టీ విషయమై తలెత్తిన వివాదం హత్యకు దారితీసింది. అంతకు ముందు కృష్ణయ్య కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేశారు. కలెక్టర్, ఎస్సీలకు ఫిర్యాదు అనంతరం తీసుకున్న చర్యలతో పోలీసు రక్షణలో గ్రామానికి రాగా, నెల రోజులకే హత్యకు గురయ్యారు. వైకాపా సానుభూతిపరులే హత్యకు పాల్పడినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు.

ఇద్దరికి నామినేటెడ్ పదవులు!

☛ పర్వీన్‌తాజ్, పంతగానికి అవకాశం ☛ అలక వహించిన నరసింహ ప్రసాద్

రైల్వేకోడూరు, బి.కొత్తకోట, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన ఇద్దరు తెదేపా నేతలకు నామినేటెడ్ పదవులు దక్కాయి. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ సభ్యురాలిగా బి.కొత్తకోటకు చెందిన ఎస్.పర్వీన్‌తాజ్, అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడిగా రైల్వేకోడూరుకు చెందిన పంతగాని నరసింహప్రసాద్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ ఇద్దరికి ఎన్డీయే విడుదల చేసిన తొలి జాబితాలోనే అవకాశం దక్కింది. పర్వీన్‌తాజ్ తెలుగు మహిళ మండల అధ్యక్షురాలిగా 1996లో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 2007 నుంచి రాష్ట్ర కార్యవర్గంలో కొనసాగుతుండగా, ప్రస్తుతం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. 2014- 2019లో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యురాలిగా పనిచేశారు. అంతకు ముందు బి.కొత్తకోట జడ్పీటీసీ సభ్యురాలిగా అయిదేళ్లపాటు పనిచేశారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడితో పాటు ఇతర నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మరోపక్క పంతగాని నరసింహ ప్రసాద్ అలక వహించినట్లు తెలుస్తోంది. మరింత ఉన్నత పదవిని ఆశిస్తూ.. డైరెక్టర్ స్థానాన్ని తిరస్కరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం పార్టీలో రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా ఉన్న తనపై ప్రేమతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ తనకు అదనపు బాధ్యతలు అప్పగించారని, అయితే ఆ పదవిని పార్టీ కోసం కష్టపడుతున్న వేరొకరికి కేటాయించాలని, పదవులు లేకపోయినా పార్టీ కోసం పని చేసే సత్తా తనకు ఉందని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు ఆయన వివరించారు.



పర్వీన్‌తాజ్, పంతగాని నరసింహప్రసాద్

ఉప ముఖ్యమంత్రి దీక్షకు సంఘీభావం



ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం వద్ద సంఘీభావం తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ పాలనలో తిరుమల లడ్డూ పవిత్రతను దెబ్బతీశారన్న కారణంతో గుంటూరులోని శ్రీదశావతార వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన 11 రోజుల దీక్షకు మద్దతుగా మదనపల్లెలో మంగళవారం ఆ పార్టీ నాయకులు సంఘీభావ కార్యక్రమం చేపట్టారు. మదనపల్లె పట్టణంలోని ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం ఎదుట జనసేన పార్టీ రాయలసీమ రీజనల్ కో-ఆర్డినేటర్ దారం అనిత ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భాజపా, తెదేపా నాయకులతో కలిసి సంఘీభావం తెలిపారు. తిరుమల పవిత్రతను దిగజార్చినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. పవన్‌కల్యాణ్ చేపట్టిన 11 రోజులు దీక్షకు మద్దతుగా తాము మదనపల్లెలో కూడా దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్, చంద్రశేఖర్, వెంకటేష్, శంకర, శ్రీనివాసులు, మల్లికార్జున, ప్రశాంత్, మల్లిక, కళావతి, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్



అధికారులతో మాట్లాడుతున్న కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్

ములకలచెరువు, బి.కొత్తకోట, న్యూస్‌టుడే : కర్నూలు రేంజి పరిధిలో గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన చర్యలు తీసుకున్నట్లు డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు మండలాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో నిఘాను పెంచాలని అధికారులను ఆదేశించారు. బి.కొత్తకోట మండలం ఠానామిట్ట చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఇక్కడ సిబ్బందిని నియమించకపోవడంతో వాహనాల తనిఖీలు నిలిచిపోయిన నేపథ్యంలో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి చెక్‌పోస్టుల పునరుద్ధరణతో పాటు వివిధ అంశాలపై అధ్యయనం చేశారు. గతంలో ములకలచెరువు సర్కిల్ పరిధిలో 100 కిలోల గంజాయి పట్టుకోవడం జరిగిందని, రేంజి పరిధిలోని నాలుగు జిల్లాల్లో గంజాయి వాడకం జరుగుతున్న ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశామన్నారు. మత్తుకు బానిసలైన విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మైనర్లకు ద్విచక్ర వాహనాలివ్వకుండా అవగాహన కల్పించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడిని ఆదేశించారు. వీరివెంట డీఎస్పీ డీఎస్పీ కొండయ్యనాయుడు, బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి తదితరులున్నారు.

టపాసులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: కలెక్టర్

రాయచోటి, న్యూస్‌టుడే: దీపావళి పండగను పురస్కరించుకుని టపాసులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. లైసెన్సు లేకుండా టపాసులు విక్రయించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అగ్ని ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని భద్రతా చర్యలను పాటించాలని సూచించారు. లైసెన్సులో తెలిపిన సామర్థ్యం మేరకే టపాసులు నిల్వ ఉంచుకుని విక్రయాలు జరపాలని వ్యాపారులను ఆదేశించారు. టపాసుల ధరలు వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. టపాసుల గోదాంలకు వినియోగించే విద్యుత్తు తీగలు నాణ్యమైనవిగా ఉండేలా చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అగ్నిమాపక, రెవెన్యూ, పోలీసుశాఖల అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మదన పల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, రాయచోటి ఆర్డీవో రంగస్వామి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి అనిల్ కుమార్, పోలీసు అధికారులు, జిల్లాలోని టపాసుల విక్రయదారులు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, పక్కన మదనపల్లె, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా



గ్రామీణ నీటిసరఫరాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : వేతన బకాయిలు చెల్లించాలని డిమాండు చేస్తూ మదనపల్లె గ్రామీణ నీటి సరఫరాశాఖ ఈఈ కార్యాలయం ఎదుట మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఝరికోన ప్రాజెక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు సాంబశివ, కృష్ణప్ప మాట్లాడుతూ ఝరికోన వాటర్ సప్లై ప్రాజెక్టు పరిధిలో 12 ఏళ్లుగా 40 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరికి ప్రతి నెలా జీతాలు చెల్లించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. గుత్తేదారు కార్మికులకు గత 11 నెలల నుంచి వేతనాలు చెల్లించలేదన్నారు. కార్మికులకు జీతాలను చేతికి ఇవ్వకుండా ప్రతి నెలా బ్యాంకు ఖాతాలో జమ చేయాలన్నారు. ఝరికోన ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న కార్మికులను ఒప్పంద పద్ధతిలో నియామకాలు రద్దు చేసి ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండు చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసం వేతనం రూ.21 వేలు చెల్లించాలని కోరారు. ధర్నాలో ఏఐటీయూసీ నాయకులు తిరుమల, దేవ, వెంకటరమణ, మురళి, కార్మికులు గురప్ప ఆనంద్‌కుమార్, రామాంజులు, రవి, నాగరాజు, శివభరత్‌రెడ్డి, సుధాకర్, యర్రయ్య, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెల్లి పెళ్లి చేసి... అంతలోనే..!

రహదారి ప్రమాదంలో సోదరుడి మృతితో విషాదం

పుల్లంపేట, న్యూస్‌టుడే: జీవనోపాధి నిమిత్తం భార్యతో కలిసి గల్ఫ్ దేశానికి వెళ్లారు. చెల్లి పెళ్లి నిశ్చయం కావడంతో దంపతులిద్దరూ వచ్చేందుకు వీలులేక ఆయన ఒక్కరే స్వగ్రామానికి వచ్చి దగ్గరుండి శుభ కార్యం జరిపించారు. నాలుగు రోజుల్లో తిరిగి వెళ్లాల్సి ఉండగా రహదారి ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లంపేట మండలం రెడ్డిపల్లెకు చెందిన గన్నేరు వెంకటేశ్ అలియాస్ చంటి (32)కి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నాలుగేళ్ల కిందట బతుకుదెరువు కోసం పిల్లలను అమ్మమ్మ వద్ద ఉంచి దంపతులిద్దరూ కువైట్ వెళ్లారు. తన సోదరికి ఇటీవల పెళ్లి నిశ్చయం కావడంతో వెంకటేశ్ ఒక్కరే వచ్చి వివాహం జరిపించారు. కువైట్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో సోమవారం నూతన ద్విచక్ర వాహనం కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం మిత్రుడు శివరాంతో కలిసి పుల్లంపేటలో వాహనానికి పూజ చేయించేందుకు శివాలయానికి వెళ్లారు. రాత్రి 9 గంటల సమయంలో తిరిగి ఇంటికొస్తుండగా రామక్కపల్లె వద్ద తిరుపతి వైపు నుంచి వస్తున్న వ్యాను ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. వెంకటేశ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందగా, శివరాంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మూడు కుటుంబాలకు వెంకటేశ్ ఒక్కడే మగ సంతానమని, తమ కుటుంబానికి ఆధారం లేకపోయిందని కుటుంబ సభ్యులు బోరున విలపించారు.



వెంకటేశ్ (పాత చిత్రం)

కేజీబీవీల్లో మౌలిక వసతులపై రాజీ పడొద్దు

రాయచోటి: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై రాజీ పడొద్దని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన విద్యాలయాలతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు మినహా బయటవారిని ఎవరినీ పాఠశాలల్లోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, తాగునీరు, నాణ్యమైన భోజన వసతి, పిల్లలు నిద్ర పోవడానికి తగిన వసతులు తదితర వాటిపై చర్చించారు. సమావేశంలో డీఈవో శివప్రకాష్‌రెడ్డి, ఏడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గండి లడ్డూలో నాణ్యతెంత?

నాసిరకం సరకులు వెనక్కి పంపిన వైనం

ఆలయంలో గుత్తేదారులదే గుత్తాధిపత్యం

– న్యూస్‌టుడే, వేంపల్లె, చక్రాయపేట

తిరుమల లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగిందని గుర్తించడంతో అశేష భక్తజనం నివ్వెరపోయారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కడప జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గండి శ్రీవీరాంజనేయ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు విక్రయించే లడ్డూ ప్రసాదం నాణ్యతపైనా అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆలయానికి ప్రతిరోజూ, ప్రధానంగా శనివారం వేలాదిమంది భక్తులు తరలివస్తుంటారు. ఆలయ వార్షిక ఆదాయం రూ.4.50 కోట్లకుపైగానే ఉంటుంది. భక్తులకు 200 గ్రాముల బరువుతో ఉన్న లడ్డూ ప్రసాదాన్ని రూ.50కు విక్రయిస్తుంటారు.

◆ ఆలయానికి వచ్చే భక్తులకు విక్రయించేందుకు లడ్డూ ప్రసాదం తయారీకి వినియోగించే సరకులకు ఏటా ఆలయ అధికారులు టెండర్లు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ఏడాదికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ టెండరును దక్కించుకుంది. వీటితోపాటు మరో రెండు సంస్థలు కూడా ఎక్కువ మొత్తానికి టెండర్లు వేశాయి. ఈ మూడు సంస్థలు ఒకరివేనన్న విమర్శలుండగా, వీటికే ఒక్కో ఏడాది సరకుల సరఫరా టెండర్లు దక్కుతుండడం గమనార్హం. ఉన్నతస్థాయిలో రాజకీయ పలుకుబడి, అధికారులకు కమీషన్లు తదితర కారణాలతో ఆయా సంస్థలకే టెండర్లు దక్కుతున్నాయి. ఆలయానికి సంబంధించి గత తొమ్మిదేళ్లుగా ఆయా సంస్థలకే టెండర్లు దక్కుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. లడ్డూ ప్రసాదం తయారీకి సరకులకు నెలకు రూ.10 లక్షలకు పైగా ఖర్చవుతోంది. ప్రసాదాల తయారీకి నాసిరకం సరకులే సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. లడ్డూ ప్రసాదం నాణ్యతపై భక్తులు అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ఇక్కడ నెలకు 25వేలకు పైగా లడ్డూ ప్రసాదాలు విక్రయాలు జరుగుతుంటాయి. ప్రధానంగా శ్రావణమాసోత్సవాల సందర్భంగా ఒక్క నెలలోనే 1.50 లక్షలకుపైగా లడ్డూ ప్రసాదాలు విక్రయించారు.

నాసిరకం సరకుల వెనక్కి: గండి అంజన్న భక్తులకు అందించే లడ్డూ ప్రసాదం తయారీకి సరఫరా చేసే సరకుల పరిశీలనకు ప్రస్తుత ఆలయ బాధ్య సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఉద్యోగులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు, ఇన్‌స్పెక్టర్, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్‌లతో ఏర్పాటు చేసిన కమిటీ అన్నదానం, లడ్డూల తయారీకి గుత్తేదారు సంస్థ పంపించే సరకులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే వినియోగించాల్సి ఉంది. లడ్డూ ప్రసాదాల తయారీకి గత జులైలో హైదరాబాద్‌కు చెందిన గుత్తేదారు సంస్థ పంపించిన నెయ్యి, నూనె, జీడిపప్పు, ఎండుద్రాక్ష నాసిరకంగా ఉండడంతో కమిటీ సూచనల మేరకు వాటిని వెనక్కి పంపారు.



భక్తులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన లడ్డూలు

తయారీలో గోల్‌మాల్

గండి క్షేత్రంలో లడ్డూ ప్రసాదం తయారీ కేంద్రంలో పెద్దఎత్తున గోల్‌మాల్ జరిగింది. ఇక్కడ మూడున్నరేళ్లుగా నెయ్యి కొనుగోలు, లడ్డూ తూకాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయి. సరకులు పంపిణీ చేసే గుత్తేదారు సంస్థతో కుమ్మక్కై లడ్డూల తయారీ కేంద్రంలో పనిచేసే ఉద్యోగి సదరు అధికారితో రహస్య ఒప్పందం కుదుర్చుకుని మిగిలిన నెయ్యిని ఇండెంట్‌గా చూపించి దోచుకున్నారు.

వెనక్కి పంపడం వాస్తవమే

గండి అంజన్న ఆలయంలో లడ్డూ ప్రసాదం తయారీకి హైదరాబాద్‌కు చెందిన గుత్తేదారు సంస్థ పంపించిన నాసిరకం సరకులను వెనక్కి పంపిన విషయం వాస్తవమే. తిరుమల లడ్డూ ప్రసాదం వ్యవహారం తెరపైకి రావడంతో దేవాదాయశాఖ కమిషనర్ అన్ని దేవాలయాల ఈవోలతో మాట్లాడారు. నెయ్యి ఎక్కడి నుంచి తెప్పిస్తున్నారు..సరకుల నాణ్యత, వినియోగం పరిశీలించాలని ఆదేశించారు. భక్తులకు నాణ్యమైన లడ్డూ ప్రసాదం విక్రయించేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం. లోటుపాట్లు సరిదిద్దుతాం.

- వెంకటసుబ్బయ్య, బాధ్య సహాయ కమిషనర్, గండి క్షేత్రం

పేదలకు బంజరు భూములివ్వాలని వినతి

రాజంపేట, న్యూస్‌టుడే: పుల్లంపేట మండలం రంగంపల్లి పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 585లో ఉన్న సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బంజరు భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరుతూ మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సబ్ కలెక్టర్ నైదియాదేవికి విన్నవించారు. వైఎస్సార్ హయాంలో ఏడు విడతల్లో నిరుపేదలకు భూములిచ్చారని.. ఆ సమయంలో పుల్లంపేట ప్రాంతంలోని బడాబాబులు పేదలకు భూములను దక్కనీయకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడైనా ఖాళీగా ఉన్న భూములను అర్హులకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మణి, ప్రసాద్, నరసింహులు, సుబ్బరాయుడు, రమణయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ నైదియాదేవికి సమస్యలు వివరిస్తున్న నాయకులు

అన్నమయ్య జలాశయాన్ని పునర్నిర్మిస్తాం

రాజంపేట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వంద రోజుల్లో సాధించిన ప్రగతిపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అధికారులు రావాల్సి ఉన్నా రాలేదు.. ఈ విషయంపై పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశానని తెదేపా నేత సుగవాసి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. రాంనగర్‌లో మంగళవారం ఆయన స్థానికులతో సమావేశమయ్యారు. అన్నమయ్య జలాశయాన్ని రెండు టీఎంసీల నుంచి 10 టీఎంసీల సామర్థ్యం వరకు నిర్మించుకునే ప్రయత్నం చేస్తామన్నారు. రాజంపేటను జిల్లా చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటానని చెప్పారు.

కృష్ణమ్మ వచ్చేదెప్పుడు... ఆయకట్టుకు చేరేదెప్పుడు?

- వాగులు, నదులపై నిలిచిపోయిన పనులు
- కాంక్రీటు నిర్మాణాలపై అంతులేని నిర్లక్ష్యం
- ఇదీ జీఎన్‌ఎస్‌ఎస్ రెండో దశ తీరు



మొగమేరు వద్ద నిలిచిపోయిన నిర్మాణం

శ్రీ కృష్ణదేవ రాయ గాలేరు-నగరి సుజల ప్రవంతి పథకం రెండో దశలో కీలకమైన పనులు చేపట్టలేదు. కాలువల్లో మట్టి పనులకు ప్రాధాన్యమిస్తున్నారు. కాంక్రీటు నిర్మాణాలను కొన్నిచోట్ల చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. మరికొన్ని ప్రాంతాల్లో దిగువ ప్రాంతానికి కృష్ణా జలాలు చేరడానికి వాగులు, నదుల్లో కట్టడాలను అసలు మొదలు పెట్టలేదు. ఆక్విటేడ్లు నిర్మించకపోతే ఆయకట్టుకు నీరందే అవకాశమే లేదు. ఇది నీటిపారుదలశాఖ సాంకేతిక నిపుణులకు తెలిసినా ఇన్నాళ్లు పెద్దగా పట్టించుకోలేదు. గుత్తేదారులు కూడా పనులు చేయకుండా ఆపేశారు. కళ్లెదుటే అపార జలనిధి అందుబాటులో ఉన్నా కరవు సీమలో బీడు వారిన నేలను కృష్ణవేణి స్పర్శ తాకలేదు. దుర్భిక్ష గడ్డలో తడారిన భూములకు సస్యశ్యామలం భాగ్యం దక్కడం లేదు. అదే ఆయట్టు రైతులకు శాపంగా మారింది.

-న్యూస్‌టుడే, కడప

జీఎన్‌ఎస్‌ఎస్ రెండో దశ ప్యాకేజీ-1లో వేముల మండలం నారేపల్లి సమీపంలో మొగమేరుపై నిర్మించాల్సిన ఆక్విటేడ్ పనులు ముందుకు కదలడం లేదు. ఉమ్మడి కడప జిల్లాలో ఏడు ప్యాకేజీల్లో 1.20 లక్షల ఎకరాలు, చిత్తూరులో 1,03,500 ఎకరాలు, నెల్లూరులో 1,500 ఎకరాలకు కృష్ణా జలాలు చేరాలంటే ఈ కట్టడం చాలా కీలకం. గాలేరు-నగరి- హంద్రీనీవా పథకాన్ని అనుసంధానం చేసి 20 టీఎంసీలను తరలించాల్సి ఉంది. వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో 2.91 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలి.

- ప్యాకేజీ-1లో ఒప్పందం విలువ రూ.371.42 కోట్లు. నాలుగేళ్ల కిందట కిందట పీఎల్ఆర్-రాఘవ సంస్థలు సంయుక్తంగా దక్కించుకుని చేస్తున్నాయి. ఆ తర్వాత రూ.419.02 కోట్లకు సవరించారు. ఇప్పటికే జరిగిన పని విలువ రూ.398 కోట్లు. మొగమేరు పైన నీటి ప్రవాహం సాఫీగా ముందుకు సాగడానికి అనువుగా ఆక్విటేడ్ 300 మీటర్లు పొడవు నిర్మించాలని తొలుత నిర్ణయించారు. నాటి ఆకృతి ప్రకారం 2,895 క్యూసెక్కుల సామర్థ్యం. అప్పట్లో రూ.29.70 కోట్లకు అనుమతిచ్చారు. అనంతరం సాంకేతిక నిపుణుల బృందాన్ని పిలిపించారు. భవిష్యత్తులో కట్టడం పటిష్ఠంగా ఉండాలంటే 41-42.60 కి.మీ వరకు అయిదు వేల క్యూసెక్కుల సామర్థ్యంతో 1.60 కి.మీ పొడవు నిర్మించాలని ప్రతిపాదించగా ఉన్నత స్థాయిలో ఆమోదించారు. ఇందుకోసం రూ.310.60 కోట్లు కావాలి. ఇక్కడ మొత్తం 54 పిల్లర్లు నిర్మించాల్సి ఉండగా కొంతమేర నిర్మించి నిలిపివేశారు. మొదట ఇంజినీరింగ్ అధికారులు ఈ పనిని పూర్తి చేయించాలని ఆలోచించలేదు. మట్టి తవ్వకం, వారధుల నిర్మాణం, సిమెంటు పూతపై దృష్టి సారించారు. గండి కోట నుంచి నీటిని తీసుకొచ్చినా దిగువ ప్రాంతానికి చేరే పరిస్థితి లేదు.

- ప్యాకేజీ-2లో 12 వేలు, పీ-3లో 25 వేలు, పీ-4లో 10 వేలు, పీ-5లో అయిదు వేలు, పీ-6లో 18 వేలు, ప్యాకేజీ-7లో 40 వేల ఎకరాలకు నీరు చేరాలంటే ఆక్విటేడ్ పూర్తవ్వాలి. ఇక్కడ కనీసం నాలుగో వంతు పనులు చేయలేదు. ప్యాకేజీ-1 పనులను నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు చేస్తుండటంతో సాంకేతిక నిపుణులు కూడా గట్టిగా ప్రశ్నించలేదు. నిర్దేశిత ఒప్పందం ప్రకారం ఎలాగైనా చేయాలని ఒత్తిడి చేస్తే బదిలీ వేటు పడుతుందని భయపడి ఆయాచితంగా లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేశారు. ఈలోగా సార్వత్రిక ఎన్నికలు రావడం, ఎన్డీయే కూటమి పాలనా పగ్గాలు చేపట్టడంతో కథ అడ్డం తిరిగింది. పని చేసినా బిల్లులు రావని బెంగతో చేయడానికి గుత్తేదారులు ముందుకు రాలేదు.

పాపఘ్నిలో నిర్మించేనా?

ప్యాకేజీ-2లో (66.150-96.500 కి.మీ) వరకు పనులు చేయాలని 2020, మే 4న రూ.398 కోట్లతో ఒప్పందం జరిగింది. ఆనక రూ.460 కోట్లకు అంచనాలను పెంచారు. ఇప్పటికే రూ.209 కోట్లు వెచ్చించారు. పెండ్లిమర్రి మండలం నందిమండలం శివారులో పాపఘ్ని నదిలో (67.900-68.60 కి.మీ వరకు) నీటి నడకల కోసం ప్రధాన కాంక్రీటు కట్టడాన్ని 2,927 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో 700 మీటర్లు పొడవు, అటు, ఇటు అనుసంధానం చేయడానికి 400 మీటర్లు పనులు చేయాల్సి ఉంది. ఇందుకోసం రూ.82.92 కోట్లు కావాలని అప్పట్లో నిర్ణయించారు. పాపఘ్నిలో ఎలాంటి కదలిక లేదు. ఇక్కడ ఆక్విటేడ్ నిర్మించి కాలువను పూర్తి చేస్తేనే దిగువ ప్రాంతంలోకి కృష్ణా జలాలు వెళ్లడానికి మార్గం సుగమం కానుంది. లేదంటే అన్నదాతలకు ఎదురుచూపులు తప్పవు.

వెయ్యినూతుల కోనలో అదే తీరు

వెయ్యినూతుల కోన ఆలయం సమీపంలోనూ వాగు నుంచి కృష్ణమ్మను దాటించాలంటే 81.050-81.525 కి.మీ మధ్యలో ప్రధాన నిర్మాణం 475 మీటర్లు, అనుసంధానం కాలువ 300 మీటర్లు నిర్మించాలి. ఇది పూర్తయితే 2,898 క్యూసెక్కులను తీసుకెళ్లవచ్చు. ఇందుకోసం రూ.28.24 కోట్లు అవసరం. ఇక్కడ ఎలాంటి పురోగతి లేదు.

పాలతల శివారులో అంతేనా

పాలతల శివారు 94.640-95.215 కి.మీ వరకు రెండు కొండల మధ్య సిమెంటు కాంక్రీట్ కట్టడాన్ని 575 మీటర్లు, అనుసంధాన నిర్మాణాలు 300 మీటర్లు చేపట్టాలి. ఇది పూర్తయితే 2,898 క్యూసెక్కుల నీటిని ప్యాకేజీ-3-7 వరకు 2,898 క్యూసెక్కులను తీసుకెళ్లవచ్చు. అదేవిధంగా చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు తరలించే వీలు ఉంటుంది. ఇక్కడ కూడా నిర్మాణాల్లో కదలిక లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

జీఎస్ఎస్ఎస్ రెండో దశ ప్యాకేజీ-1, 2లో మొగమేరు, పాపఘ్ని, వెయ్యినూతుల కోన, పొలతల సమీపంలో ఆక్విటేడ్లు నిర్మించాల్సిన మాట వాస్తవమే. ఇవి పూర్తయితేనే దిగువ ప్రాంతానికి కృష్ణా జలాలు వెళతాయి. లేదంటే ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేదు. పనులు పూర్తి చేయడానికి అనుమతితోపాటు నిధులివ్వాలని ఇటీవల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నత స్థాయి నుంచి ఉత్తర్వులు రాగానే పనులను మొదలు పెట్టి శరవేగంగా పూర్తి చేయిస్తాం. నిర్దేశిత ఆయకట్టుకు నీరిస్తాం. - ఎం.మల్లికార్జునరెడ్డి, సీఈ, నీటిపారుదల శాఖ, కడప

రైతులకు సదుపాయాలు కల్పించాలి



మాట్లాడుతున్న డీడీ సత్యనారాయణ, పక్కన అధికారులు

రామసముద్రం, న్యూస్‌టుడే: రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఈ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ అధికారులకు సూచించారు. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం గ్రామ సర్పంచి రెడ్డెప్పనాయుడు అధ్యక్షతన జరిగింది. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, పట్టు పరిశ్రమశాఖల అనుసంధానంతో సదస్సు జరగాల్సి ఉండగా ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖల అధికారులు గైర్హాజరు అయ్యారని రైతులు మండిపడ్డారు. ఆయా శాఖల్లో అమలయ్యే పథకాలు ఎవరు చేపడతారని అధికారులను నిలదీశారు. అలాగే పాడిపరిశ్రమ అభివృద్ధికి దాణా, సైలేజ్, గడ్డి విత్తనాలు రాయితీపై పంపిణీ చేయాలని మదనపల్లె డివిజన్ పశువర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణకు విజ్ఞప్తి చేశారు. పాల ధర కంటే సమీకృత దాణా ధరలు మార్కెట్‌లో మండిపోతున్నాయని ఆందోళన వ్యక్తపరిచారు. మదనపల్లె ప్రాంతంలో దాణా పరిశ్రమ నెలకొల్పాలని విన్నవించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ ఏడీఏ రోహిణి, ఏవో మోహన్‌కుమార్, తెదేపా నాయకులు వెంకట రమణారెడ్డి, హరినాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డిశేఖర్, వేణుగోపాల్, కృష్ణప్ప, వెంకటరమణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడలలో రాణించి జిల్లాకు గుర్తింపు తీసుకు రావాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడలను ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడల వల్ల మానసిక స్థితి పెరుగుదలతో పాటు శారీరక ధృఢత్వం పెరుగుతుందన్నారు. క్రీడలతో విద్యార్థులకు బంగారు భవిషత్తు ఉంటుందని రాష్ట్ర వ్యాయామ విద్యా సంచాలకుడు గుండ్రాజు భానుమూర్తిరాజు పేర్కొన్నారు. తాగునీరు, ప్రాథమిక చికిత్స పరికరాలు, వసతి అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. అనంతరం ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శివకుమార్‌రెడ్డి, క్రీడల కోఆర్డినేటర్ జగదీశ్వరయ్య, విద్యా కమిటీ ఛైర్మన్ ఆనంద్ బాబు, కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, గిరిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరాజు, అమర్నాథరెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాష్ట్ర వ్యాయామ విద్య సంచాలకుడు భానుమూర్తిరాజు

కూటమితో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

కలకడ, న్యూస్‌టుడే : ప్రజలకు అందుబాటులో ఉంటూ పల్లెల్లోని ప్రజా సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కారం చూపడంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తానని పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎనుగొండపాళెం, బాలయ్యగారిపల్లె పంచాయతీలలో కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తయిన సందర్భంగా నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలసి 'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలు ఆవిష్కరించి, మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అప్పులపాలైందని, ప్రజా సమస్యలను గాలికొదిలేసిందన్నారు. రైతుల భూముల పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ బొమ్మ వేసుకొన్నాడని, ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ లోగోతో కూడిన కొత్త పాసు పుస్తకాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు పేదలకు పింఛన్లు రూ.4 వేలకు పెంచి 1వ తారీఖున ఉదయాన్నే పంపిణీ చేస్తున్నారని, ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు పడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వివిధ సమస్యలు విన్నవించగా పరిష్కారానికి హామీ ఇచ్చారు. సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. ఆయనతో పాటు తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సూర్యప్రకాశ్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవిప్రకాశ్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ నాయుడు, తహసీల్దారు ఫణికుమార్, ఈవోపీఆర్డీ లతీఫ్ ఖాన్, ఎన్డీయే కూటమి నాయకులు శ్రీనివాసులురెడ్డి, మధుసూదనరెడ్డి, తిరుపతి నాయుడు, కోట రమణ, కాంతారావు, శేఖర్‌నాయుడు, కేశవులునాయుడు, జ్ఞానశేఖర్, వెంకటమల్లప్ప, వెంకట్రమణ, విశ్వనాథ, ఈశ్వర, చిరంజీవి, అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



కలకడ ఎనుగొండపాళెం సమావేశంలో కరపత్రాలు చూపుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, నాయకులు

జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలకు చర్యలు

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో వైద్యసేవల మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు అన్నారు. మంగళవారం ఆయన పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి కూడా సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు. ఆసుపత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఆమె ఇదే ఆసుపత్రిలో ఉన్నారు. పుంగనూరులో గైనకాలజీ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆమె మంగళవారం బదిలీపై వెళ్లారు. దీంతో పూర్తిస్థాయి సూపరింటెండెంట్‌గా ఎంఎస్ రాజు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది దురుసు ప్రవర్తన మానుకోవాలన్నారు. అనంతరం ఎన్టీఆర్ వైద్యసేవ, ఆహార పంపిణీ, భద్రతా సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్ఎంవో డాక్టర్ జ్ఞానేశ్వర్, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు మంజు, నాగశ్రీతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు

అక్రమ నిర్మాణాల తొలగింపు

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ మల్లారపువాండ్లపల్లెకు సమీపంలో గత వైకాపా ప్రభుత్వ పాలనలో అక్రమంగా ప్రభుత్వ భూమి, హంద్రీ-నీవా కాలువ భూమిలో నిర్మించుకున్న అక్రమ నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భార్గవి మాట్లాడుతూ... గర్నిమిట్ట పంచాయతీలో సర్వే నెంబర్లు 1020, 1021లో అనుమతులు లేకుండా నిర్మించారని తెలిపారు. అక్కడ సుమారు 50 మంది అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిలో 20 నిర్మాణాలను కూల్చి వేసినట్లు ఆమె తెలిపారు. విషయం తెలుసుకున్న లబ్ధిదారులు అక్కడికి వచ్చి జేసీబీని అడ్డుకోవడంతో అధికారులు వెనుతిరిగి వచ్చేశారు. ఈ విషయమై సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ మాట్లాడుతూ దళితుల ఇళ్లు కూల్చి వేయడం అన్యాయమని, వారికి ప్రభుత్వ పరంగా న్యాయంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండు చేశారు.



యంత్రంతో తొలగిస్తున్న అక్రమ నిర్మాణాలు

ఎర్రచందనం కూలీల అరెస్టు

వీరబల్లి, న్యూస్‌టుడే: మండలంలోని సానిపాయి అటవీ పరిధిలోకి ఎర్రచందనం కోసం వెళ్తున్న 15 మంది కూలీలను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌ఛార్జి ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు. సానిపాయిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సుండుపల్లి మండలం కొలిమిట్ట ప్రాంతంలో నాలుగు కార్లలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా వెంబడించి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిలో అన్నమయ్య జిల్లాకు చెందిన వారు నలుగురు ఉండగా.. 11 మంది తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందిన వారీగా గుర్తించామన్నారు. వారి నుంచి రంపాలు, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు చేసిన వారిని టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సీఐ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. వారిని ఎర్రచందనం చెట్లు నరికేందుకు ఎవరు పురమాయించారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో డీఎస్పీ డి.మురళీధర్, ఆర్ఎస్సై సురేష్ బాబు పాల్గొన్నారని చెప్పారు.

జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పీలేరు, న్యూస్‌టుడే: ఈ నెల 26న చిత్తూరులో జరగనున్న జిల్లాస్థాయి పోటీలకు పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శని, మంగళవారాలు నియోజవర్గస్థాయి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు క్రీడల నిర్వాహకురాలు ఉషారాణి మంగళవారం తెలిపారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, వంద, రెండు వందలు, 800 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పోటీల్లో జూనియర్, సీనియర్ విభాగాలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. పోటీలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నటరాజ ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయురాలు రాణి, సంపూర్ణ, నరేంద్ర, విశ్రాంత వ్యాయామోపాధ్యాయ దంపతులు వారాది, నిర్మలాదేవి పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామోపాధ్యాయులు

అధ్యాపకుడికి అంతర్జాతీయస్థాయి శాస్త్రవేత్తగా గుర్తింపు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఆచార్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ శివయ్యకు అంతర్జాతీయ స్థాయి సైంటిస్ట్‌గా గుర్తింపు వచ్చినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. 2024 సంవత్సరానికి గాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ వారు ప్రకటించిన ప్రపంచంలోనే టాప్‌లో ఉన్న 2 శాతం సైంటిస్టుల జాబితాలలో శివయ్యకు గుర్తింపు లభించిందన్నారు. పరిశోధన రంగంలో ఆయన చేసిన కృషికి గాను ఈ ఘనత లభించిందన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ శివయ్యను ప్రిన్సిపల్‌తో పాటు కరస్పాండెంట్ డాక్టర్ విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల, అడ్వైజర్ ఆర్ అండ్ డి డాక్టర్ తులసీరాంనాయుడు, అధ్యాపకులు అభినందించారు.



శివయ్యను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్, అడ్వైజర్ తులసీరాంనాయుడు

ఉమ్మడి కడప జిల్లాలో దేవాదాయశాఖ ఈవోల బదిలీలు

రాయచోటి, న్యూస్‌టుడే: ఉమ్మడి కడప జిల్లాలోని పలు ఆలయాల ఈవోలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లక్కిరెడ్డిపల్లె గంగమ్మ ఆలయ ఈవో మారుతీప్రసాద్‌ను చాపాడు మండలం అల్లాడుపల్లి వీరభద్ర స్వామి ఆలయ ఈవోగా బదిలీ చేశారు. పులివెందులలోని మిట్టమల్లేశ్వర, రంగనాథ గ్రూపు ఆలయాల ఈవో కె.వెంకటరమణను వెల్లాల సంజీవరాయస్వామి ఆలయ ఈవోగా, పులివెందుల ఆలయాలకు రాయచోటి వీరభద్రస్వామి ఆలయ ఈవో వెంకటరమణారెడ్డిని ఇన్‌ఛార్జి ఈవోగా నియమించారు. నందిమండలంలోని కొండగంగమ్మ ఆలయానికి కుప్పం గంగమ్మ ఆలయ ఈవో చలపతి బదిలీ చేశారు. సంబేపల్లె మండలంలోని నల్ల గంగమ్మ ఆలయ ఈవో కొండారెడ్డిని వీరపునాయునిపల్లిలోని సంగమేశ్వర స్వామి ఆలయ ఈవోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. లక్కిరెడ్డిపల్లె గంగమ్మ ఆలయానికి కె.శ్రీనివాసులును ఈవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

గంజాయి విక్రేతల అరెస్టు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు రెండో పట్టణ సీఐ రామచంద్ర తెలిపారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశానుసారం డీఎస్పీ కొండయ్యానాయుడు ఆధ్వర్యంలో మదనపల్లె పట్టణంలోని చంద్రాకాలనీ సమీపంలోని లక్ష్మీనగర్‌లో తనిఖీలు నిర్వహించగా ఖాళీ స్థలంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా బ్యాగుతో ఉండగా వారిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద 2 కిలోల గంజాయి ఉండటంతో సీజ్ చేసి నిందితులైన లక్ష్మీనగర్‌కు చెందిన ఆవుల లక్ష్మయ్య (38), చీకలగుట్టకు చెందిన ధనియాల రమేష్ (48)లను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు. మదనపల్లె పట్టణంలో గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. మత్తు రహిత మదనపల్లెగా మార్పు చేసేందుకు ప్రజలంతా సహకారం అందివ్వాలని సీఐ కోరారు.



గంజాయి విక్రయిస్తున్న నిందితులు వీరే

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

సనాతన ధర్మం బోర్డు ఏర్పాటుకు వినతి



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ పరిషత్ సంఘం నాయకులు

పీలేరు గ్రామీణ: తిరుమలలో సనాతన ధర్మ పరిరక్షణకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని పీలేరుకు చెందిన హిందూ పరిషత్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. లడ్డూ తయారీలో చోటు చేసుకున్న వివాదంపై పట్టణంలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి ఈ తరహా సమస్యలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కుమార్‌స్వామి, మోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు కాదు... రహదారి



రామసముద్రం-పుంగనూరు ప్రధాన రహదారిలోని గుంతఎంబాడి వద్ద రోడ్డు పల్లంగా ఉండడంతో వర్షపు నీరంతా చేరి చెరువును తలపించింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల చోదకులు నీటిలో ప్రయాణించడానికి ఇబ్బందిపడ్డారు. వర్షపు నీరు రోడ్డుపై నిల్వ లేకుండా ఉండే విధంగా పనులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ బుర్రయ్యను వివరణ కోరగా నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, రామసముద్రం

మేమున్నాం... మీకు తోడుగా... (10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

స్పందనకు వందనం

పీలేరు గ్రామీణ : రాజీవ్‌నగర్, శ్రీనాథపురం కాలనీల్లోని వీధుల్లో మురుగు కాలువల్లో పూడిక తీశారు. ఇక్కడ మురుగు కాలువల్లో చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయి పూడిన స్థితిలో ఉండేవి. ఇదే సమస్యపై ఈ నెల 20న 'పూడిన కాలువలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారి రవి కార్మికులతో పూడిక తొలగించారు.

పీలేరు : పట్టణంలోని పోలీసు వసతి గృహాలకెదురుగా శివకుమార్‌రెడ్డి వీధిలో ఉన్న మురుగు కాలువలో మట్టిని సోమ, మంగళవారాల్లో పీలేరు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. వీధిలో మురుగు పారి పాదచారులు నడవడానికి ఇబ్బందిగా ఉందని ఈనాడులో మేమున్నాం... మీకుతోడుగాలో భాగంగా సమస్య సోమవారం ప్రచురితమవడం తెలిసిందే. దానికి స్పందించిన పీలేరు పారిశుద్ధ్య అధికారి రవికుమార్ వీధిలోకి మురుగునీరు వెళ్లే కాలువలో పూడికమట్టిని పూర్తిగా తొలగించి సమస్యను పరిష్కరించారు.

- న్యూస్‌టుడే, కంభంవారిపల్లె

?: గర్నిమిట్ట వారపు సంతలో అధికారులు మరుగుదొడ్లు నిర్మించారు. నీటి సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి? నీటి సౌకర్యం కల్పించాలి? - రాజశేఖర్, గర్నిమిట్ట
✓: నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.
- గఫూర్, ఈవోపీఆర్డీ, కంభంవారిపల్లె

- న్యూస్‌టుడే, పెద్దమండ్యం

?: మండలంలోని కందుకూరు తిరు వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు? - శ్యామల, కందుకూరు
✓: రెండు రోజుల్లో వీధి దీపాలు మరమ్మతు చేయిస్తాం
- మనోహర్, పంచాయతీ కార్యదర్శి, కందుకూరు

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: బసినికొండ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీ వద్ద చెత్తదిబ్బలు పేరుకుపోయాయి. కురపర్తి అనాథాశ్రమం రోడ్డులో అక్కడక్కడ ఏర్పాటు చేసిన చెత్తకుండీలు నిండిపోయి దుర్వాసన వస్తుంది? - వేణు, బసినికొండ
✓: పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. - విష్ణు, కార్యదర్శి, బసినికొండ, మదనపల్లె

?: మండలంలోని పుంగనూరు రోడ్డు బసినికొండ-1 సచివాలయం సమీపంలోని విద్యుత్తు స్తంభాల చుట్టూ తీగ మొక్కలతో ప్రమాదకరంగా ఉంది. వర్షాలు కురిస్తే విద్యుత్తు ఘాతానికి గురయ్యే అవకాశాలున్నాయి?
- లీలావతి, పుంగనూరు రోడ్డు, మదనపల్లె
✓: పిచ్చి మొక్కలు తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం.
- శ్రీహరి, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ, మదనపల్లె

ఆసుపత్రిలో తాగునీటికి కటకట!

క్యాన్లు కొనుగోలు చేస్తేనే దాహం తీరేది ● బయట కొనాల్సి వస్తోందంటున్న రోగులు



నిరుపయోగంగా శీతల శుద్ధి యంత్రం

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రిలో తాగునీటికి రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. పీలేరులో రూ.24 కోట్లతో ఆసుపత్రిని ఆధునికీకరించి గత ప్రభుత్వ హయాంలో ప్రారంభోత్సవం చేశారు. అయితే మౌలిక వసతులు మాత్రం కల్పించలేదు. ప్రధానంగా ఆసుపత్రికి రోజుకు 350 మంది అవుట్ పేషెంట్లు, వంద మంది రోగులు వస్తున్నా తాగునీటి వసతి మాత్రం కల్పించలేదు. దీంతో రోగులు, వారి సహాయకులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్వో ప్లాంటు ఏర్పాటులో జాప్యం : ఆసుపత్రి ఆవరణలో బోరు తవ్వించి దాని నుంచి ఆసుపత్రిపై ఉన్న ట్యాంకుకు నీటి సరఫరా కల్పించారు. ఆ నీటిని మరుగుదొడ్లకు, ఆసుపత్రి వార్డులు శుభ్రం చేయడానికి వినియోగిస్తున్నారు. ఏటొచ్చీ రోగులకు తాగునీటి వసతి మాత్రం కల్పించడం లేదు. ఆసుపత్రి క్యాజువాలిటీ, ఓపీ వార్డుల్లో తాగునీటికి మూడు ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. కానీ వాటిల్లో నీళ్లు మాత్రం ఉండవు.



ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన క్యాను

ఆసుపత్రిపై ఉన్న ట్యాంకు నుంచి వచ్చే నీటిని శుద్ధిచేసి గొట్టాల ద్వారా శీతల యంత్రాలకు సరఫరా చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఆసుపత్రిపైన ఆర్వో ప్లాంటుకు కూడా ఏర్పాటు చేయలేదు. రోగుల అవసరాలకు ప్రైవేటుగా క్యాన్లలో తాగునీరు కొనుగోలు చేసి వార్డులో ఏర్పాటు చేస్తున్నారు. రోజుకు ఒక పర్యాయం మాత్రమే క్యాన్లు కొనుగోలు చేస్తారు. ఆ నీరు అయిపోతే ప్రజలు బయట మార్కెట్‌లో నీళ్ల సీసాలు, లేదా క్యాన్ల నుంచి లీటరు రూ.మూడు చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఆసుపత్రిలో నీళ్ల వసతి లేనందున కొందరు ఇళ్ల నుంచి సీసాల్లో నీళ్లు తీసుకువచ్చి దాహం తీర్చుకుంటున్నారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతులపై నివేదికను ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డెప్పల్ల కిందట పీలేరు ఎంపీడీవో కార్యాలయం జరిగిన మండల స్థాయి అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి అందజేసినా ఇంకా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో పాటు ఆసుపత్రికి అవసరమైన ఆక్సిజన్ కూడా ప్రైవేటుగా కొనుగోలు చేస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో రూ.30 లక్షల విలువైన ఆక్సిజన్ ప్లాంటు కొవిడ్ సమయంలో అత్యవసరంగా ఏర్పాటు చేశారు. దాని నుంచి పాత ఆసుపత్రి భవనాలకు గొట్టాల ద్వారా ఆక్సిజన్ సరఫరా చేసేవారు. కొత్త భవనాలు ప్రారంభించి వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చినా ఆక్సిజన్ ప్లాంటు నుంచి వార్డులకు గొట్టాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆక్సిజన్ ప్లాంటు నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఆసుపత్రి భవనాలకు నిధులు మంజూరయ్యాయని ఆక్సిజన్ ప్లాంటు నుంచి భవనాలకు గొట్టాలు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు కానందున ఏర్పాటు చేయలేదని వైద్య విధాన పరిషత్ ఇంజినీర్లు తెలిపారు. దీంతో 'అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని' అన్న చందంగా తయారైంది ఆసుపత్రి పరిస్థితి. మామూలు వాడకానికి బోరు నీరున్నా ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయనందున నీళ్లు, గొట్టాలు ఏర్పాటు చేయనందున ఆక్సిజన్ కొనుగోలు చేయాల్సిన దుస్థితి వచ్చింది. గత వైకాపా ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించకుండా ఉన్నఫలంగా భవనాలు ప్రారంభించి మా హయాంలో ఆసుపత్రి వచ్చిందని చేతులు దులుపుకొన్నారు. అధికారులు చొరవ తీసుకుని వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం : కొత్తగా ప్రారంభించిన ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించడంలో జాప్యం అవుతోంది. వైద్య సేవల్లో జిల్లాస్థాయిలో పీలేరు ఆసుపత్రికి గుర్తింపు ఉన్నా మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. ఏఏ వసతులు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి ద్వారా ఉన్నతాధికారులకు పంపాం. నిధులు మంజూరైన తరువాత వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించి పనులు జరుగుతాయి.
- డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్, సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి, పీలేరు

పోటీ పరీక్షల్లో సత్తా చాటాలి



విద్యా సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులు పోటీ పరీక్షల్లో సత్తా చాటి మదనపల్లెకు పేరు తీసుకురావాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మంగళవారం ఉర్దూ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర మైనారిటీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ సంస్థ ద్వారా నెల రోజులుగా జరుగుతున్న టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీ సంస్థచే ముద్రించిన విద్యా సామగ్రిని ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో రూటా రాష్ట్ర నాయకులు పఠాన్ మహమ్మద్‌ఖాన్, కౌన్సిలర్ నాగార్జునబాబు, తెదేపా మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, నాదెళ్ల విద్యాసాగర్, గంగారపు నవీన్‌చౌదరి, దాదుఖాన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షాజహాన్, పాఠశాల కమిటీ ఛైర్మన్ మహమ్మది, ఉపాధ్యాయులు ఇస్మాయిల్, హఫీజా, నాదిర్‌షావల్లి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన టెట్ అభ్యర్థులు పాల్గొన్నారు.

రామసముద్రంలో సభ నేడు

రామసముద్రం: రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె గ్రామ పంచాయతీ కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భానుప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా ఆస్తుల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే



మాట్లాడుతున్న తెదేపా నేత జయచంద్రారెడ్డి

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: వచ్చే అయిదేళ్ల పాలనలో ప్రజల ఆస్తుల పరిరక్షణ బాధ్యత తెదేపా తీసుకుంటుందని ప్రజలు భయాలు వీడి నిశ్చింతగా ఉండవచ్చని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వెల్లడించారు. మంగళవారం మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పిట్టావాండ్లపల్లె వద్ద 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం తెదేపా నాయకుడు రాజా ఆధ్వర్యంలో జరిగింది. ప్రజాదర్బార్ నిర్వహించి ఎమ్మెల్యే వినతిపత్రాలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వంలో మీ భూములకు భద్రత ఉంటుందన్నారు. మండలంలోని గ్రామీణ రహదారులకు రూ.3.50 కోట్లు నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. కేజీబీవీ పాఠశాలలో దోమలు అధికంగా ఉన్నాయని విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికితేగా రూ.3.50 లక్షలతో దోమల నివారణకు మెష్ అమర్చనున్నట్లు తెలిపారు. సిమెంటు రహదారులకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచి రెడ్డెమ్మ, తహసీల్దారు ధనంజయులు, ఎంపీడీవో రమేశ్‌బాబు, మండల తెదేపా అధ్యక్షుడు పుర్రా వెంకటరమణ, రాజంపేట పార్లమెంటరీ తెదేపా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్, మీడియా అధికార ప్రతినిధి రాజన్న, తెదేపా నాయకులు విద్యాసాగర్, నవీన్‌చౌదరి, గుర్రప్ప నాయుడు, జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు, తెదేపా నాయకులు రెడ్డెప్పరెడ్డి, సుధాకర్‌రావు, మేస రామకృష్ణ, మల్లప్ప, మల్లికార్జున, శ్రీపతి, జయన్న, మహమ్మద్ రఫీ, రెడ్డెప్ప, ప్రసాద్, మునెప్ప, నందకుమార్, లక్ష్మన్న, షఫి, ఖాసీం, జనసేన నాయకులు తోట కల్యాణ్, ప్రదీప్‌సింగ్, ఈటకట్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా వారికంటే తెల్లదొరలే నయం

పెద్దమండ్యం: వైకాపా వారి కంటే తెల్లదొరలే నయమని నియోజకవర్గ తెదేపా నేత జయచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం పెద్దమండ్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కు వెళ్లిందన్నారు. గత దుర్మార్గ ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేదని, అంతా కలసి రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని అన్నారు. ఒక సైకోకు రాష్ట్రాన్ని అప్పజెబితే అతనితో దొంగలు అంతా కలిసి దోచుకుని దాచుకున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పాపేపల్లి పంచాయతీ గుడిశవారిపల్లె వద్ద కట్ట వెడల్పు పనులకు రూ.49 లక్షలు నిధులు విడుదలైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడ్ మల్లికార్జుననాయుడు, సాయిలోకేష్, ఎంఈవో మనోహర్, వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీధర్‌రావు, తహసీల్దార్ సయ్యద్ అహమ్మద్, ఎపీవో మురళి, ఏవో బాబునాయక్, ఏపీఎం మధుశేఖర్‌బాబు, నాయకులు సుమన్, విశ్వనాథ, ప్రసాద్, గంగాధర్, మహేష్, నాగూర్, అస్రఫ్, ప్రభాకర్, నారనాగేశ్వర్, శంకర్, పూలశెట్టి సుబ్బయ్య, హసీం సాహెబ్, రఘురాం, వినోద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ చట్టం తీసుకురావాలి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: చిన్నతరహా వాహన కార్మికుల కోసం సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని తంబళ్లపల్లె సీపీఐ ప్రాంతీయ కార్యదర్శి మనోహర్‌రెడ్డి డిమాండు చేశారు. మంగళవారం బి.కొత్తకోటలో చిన్న తరహా వాహనాల డ్రైవర్ల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ లక్షలాది మంది నిరుద్యోగ యువకులు అద్దెలకు వాహనాలను నడుపుతూ ఉపాధి పొందుతుండగా ఇటీవల కాలంలో నష్టాలు వస్తున్నాయని, ఇలాంటి సమయంలో ప్రభుత్వ సహకారాన్ని అందివ్వాలని సూచించారు. డ్రైవర్ల ఇబ్బందులను అధ్యయనం చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం అధ్యక్షుడు కంచి బలరాంరెడ్డి, స్థానిక నాయకులు ఇందులో పాల్గొన్నారు.

ఎస్.ఐ.గా రమణ

పెద్దమండ్యం, న్యూస్‌టుడే: పెద్దమండ్యం ఎస్.ఐ.గా పీవీ రమణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇతను మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

పక్కా గృహాల నిర్మాణమే లక్ష్యం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు అసంపూర్తిగా ఉన్న పక్కాగృహాలను పూర్తి చేయడమే లక్ష్యం 'మన ఇళ్లు... మన గౌరవం' కార్యక్రమాన్ని చేపట్టినట్లు గృహ నిర్మాణశాఖ మదనపల్లె ఈఈ వెంకటదాస్ తెలిపారు. బి.కొత్తకోట మండల పరిషత్తు కార్యాలయంలో గృహ నిర్మాణాలపై వివిధశాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఈ నెల 28న బి.కొత్తకోటలో మన ఇళ్లు... మన గౌరవం కింద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తంబళ్లపల్లె డీఈ వెంకటరెడ్డి మాట్లాడుతూ... పక్కా గృహాలను పూర్తి చేయడానికి వెలుగు ద్వారా ఆర్థిక సహకారాన్ని అందివ్వాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమం ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎం మురళి, ఏఈ సరోజ్‌ఖాన్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ అలీఖాన్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

28న ప్రాయశ్చిత్త దీక్ష

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : తిరుమల వేంకటేశ్వర స్వామి మహా ప్రసాదంలో వినియోగించే నెయ్యిలో కల్తీ జరగడం, ఆ విషయం తెలియక ప్రసాదాన్ని అందరికీ పంచడం వల్ల లడ్డూ పవిత్రతకు భంగం కలిగిందని గోశాల నిర్వాహకుడు రాజశేఖర్‌స్వామి, ఆర్ఎస్ఎస్ నాయకులు మణి, ప్రవీణ్ తెలిపారు. ఈ పాపదోషాన్ని పోగొట్టుకునేందుకు ఈ నెల 28న మదనపల్లెలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉదయం 7 గంటలకు గోవింద మాల ధరించి 11 రోజుల పాటు ప్రాయశ్చిత్త దీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబరు 8వ తేదీన అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ గోవింద మాలను హిందువులంతా వేసుకుని ప్రాయశ్చిత్త దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

జూదరుల అరెస్టు

మదనపల్లె నేరవార్తలు: అయిదుగురు జూదరులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఒకటో పట్టణ సీఐ చాంద్‌బాషా తెలిపారు. మదనపల్లె పట్టణ శివార్లలోని వడ్డిపల్లె సమీపంలోని ఖాళీ స్థలంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో తనతో పాటు ఎస్ఐలు అన్సర్‌బాషా, శ్రీనివాస నాయక్, సిబ్బంది సంయుక్తంగా దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో అయిదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుచి రూ.20,400 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్కడైనా జూదం ఆడటం, కర్ణాటక మద్యం, సారా విక్రయాలు చేస్తుంటే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

తెదేపా నాయకుడి మృతికి నివాళి

పెద్దతిప్పసముద్రం : తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కార్యకర్తలందరూ పార్టీ కోసం పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్ అన్నారు. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి తమ్ముడు సురేంద్రబాబురెడ్డి మృతి చెందడంతో అంత్యక్రియల్లో పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీ కార్యక్రమాల్లో ప్రతి కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలో తాను పర్యటిస్తే పార్టీ నాయకులు వర్గాలుగా విడిపోయి నష్టం జరుగుతుందని కార్యకర్తలకు తెలిపారు. సమావేశంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, నాయకులు కుడుం శ్రీనివాసులు, మండల కన్వీనర్లు పాలగిరి సిద్ధ, ఆనంద్‌రెడ్డి, బిల్డర్ రమణ, నారాయణస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

రామసముద్రం, న్యూస్‌టుడే: వ్యక్తి అదృశ్యంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. వెంకటసుబ్బయ్య తెలిపారు. రామసముద్రం మండలం కేసీపల్లె గ్రామ పంచాయతీ మిట్టఎంబాడికి చెందిన మధుసూదన్‌రెడ్డి గొర్రెల వ్యాపారం చేస్తాడు. ఈ నెల 21న సాయంత్రం పుంగనూరుకు వెళ్లి అనంతరం తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో తండ్రి మాధవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. తెలిపారు.

నాటి ఒడంబడికతో ఎస్సీలకు ద్రోహం

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పూనా ఒడంబడిక ఎస్సీలకు ద్రోహం చేసిందని మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధరణికుమార్ అన్నారు. మంగళవారం ఆయన పీలేరులో మాట్లాడుతూ... అణగారిన వర్గాల కోసం ప్రత్యేక, భిన్నాభిప్రాయాలను తొలగిస్తూ చేసుకున్న ఒప్పందమే దీని సారాంశమని ఆయన గుర్తు చేశారు. 83 ఏళ్ల కిందట సెప్టెంబరు 24న రెండు విభిన్న వర్గాల మధ్య జరిగిన ఈ ఒప్పందం చెడు ప్రచారం కారణంగా నేటికీ ఎస్సీలు నిజమైన రాజ్యాధికారానికి నోచుకోలేదని ఆయన గుర్తు చేశారు. అంబేడ్కర్ కృషి ఫలితంగా ఎస్సీ, ఎస్టీలకు రాజకీయంగా రిజర్వేషన్లు దక్కాయని ఆయన అన్నారు. జెట్టి మల్లికార్జున, రవీంద్ర పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంగా దేవసేన

కలికిరి గ్రామీణ, న్యూస్‌టుడే: కలికిరి వెలుగు ఏపీఎంగా దేవసేన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. తవణంపల్లె నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. డ్వాక్రా సంఘాల బలోపేతానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు.

క్రీడలతో ప్రత్యేక గుర్తింపు

ములకలచెరువు : విద్యార్థులు క్రీడల్లో రాణించి పాఠశాలతో పాటు గ్రామాలకు గుర్తింపు తీసుకురావాలని తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దేవళచెరువు జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడలు జరిగాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు తెదేపా నేత జయచంద్రారెడ్డి బహుమతులు అందజేశారు. ఎంఈవో వెంకటరమణ, హెచ్‌ఎం చంద్రకళ, పారిశ్రామికవేత్త గిరిధర్ రెడ్డి, నాయకులు కేశవరెడ్డి, నరసింహారెడ్డి, సురేష్, కెవి.రమణ తదితరులు ఉన్నారు.

ఘనంగా జాతీయ సేవా పథక దినోత్సవం



పుంగనూరు రోడ్డులో మొక్కలు నాటుతున్న ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలని మదనపల్లె ప్రభుత్వ మహిళా, శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కృష్ణవేణి, రమాదేవి, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవం సందర్భంగా కళాశాలల్లోని విద్యార్థులు పరిసరాలు పరిశుభ్రంతో పాటు ఆర్టీసీ బస్టాండు, కోమటివానిచెరువు కట్టపై పిచ్చిమొక్కలు తొలగించారు. బి.కొత్తకోట, పెద్దమండ్యం, పీలేరు ప్రాంతాల్లో విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లతో పాటు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం



ఆర్టీసీ బస్టాండులో పరిసరాలు శుభ్రం చేస్తున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు



కోమటివాని చెరువు కట్టపై పిచ్చిమొక్కలు తొలగిస్తున్న శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు

ఉలవల పంపిణీ

పెద్దమండ్యం: ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని నియోజకవర్గ తెదేపా నేత జయచంద్రారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం పొలంబడి గోడపత్రాలు ఆవిష్కరించి రాయితీపై వచ్చిన ఉలవలు రైతులకు అందజేశారు. అనంతరం శివపురంలో కార్యకర్త చింటూ తండ్రి చనిపోగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏవో బాబునాయక్, సిబ్బంది సుగుణ, అనిదీప్, మహేష్, నాయకులు గంగాధర్, మహేష్, సుమన్, సాయి లోకేష్, సాంబ, ప్రసాద్, మాజీ సర్పంచి రెడ్డెమ్మ పాల్గొన్నారు.

బాల భటులు... భవితకు రక్షకులు

ఎన్‌సీసీపై యువత ఆసక్తి ● ధ్రువీకరణ పత్రంతో ఉపయోగం



శిక్షణ శిబిరంలో ఎన్‌సీసీ క్యాడెట్లు


పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ, పీజీ విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడానికి అమితాసక్తి కనబరుస్తున్నారు. ఎన్‌సీసీలో చేరి 'సీ' సర్టిఫికెట్ లక్ష్యంగా సాధన చేస్తున్నారు. ఒకసారి ఎన్‌సీసీలో చేరితే శరీర సౌష్టవంతో పాటు, క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి అలవడేలా విద్యార్థులను తీర్చిదిద్దుతారు. దీనికి తోడు ఉద్యోగ నియామకాలు, ఉన్నత చదువుల్లో ఎన్‌సీసీకి ప్రత్యేక కోటా ఉండడమే ఇందుకు కారణం. తిరుపతిలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో పీలేరు సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల 30 మంది విద్యార్థులు నూతనంగా ఎన్‌సీసీలో చేరారు. ఎన్‌సీసీలో చేరి కఠోర సాధన చేస్తున్న వారి అభిప్రాయాలను ఈనాడుతో పంచుకున్నారు

క్రమశిక్షణ అలవడుతుంది




ఎన్‌సీసీ అనగానే క్రమశిక్షణకు మారుపేరు. ఇక్కడ శిక్షణ తరగతులతో సత్ప్రవర్తన, దేశభక్తి అలవడుతుంది. చాలామంది నాతోటి విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. సీ సర్టిఫికెట్ సాధించడమే నా లక్ష్యం.
- సంజీవ, డిగ్రీ విద్యార్థి, పీలేరు

పోలీసు అవడానికే




రక్షణ విభాగంలో ఉద్యోగం సాధించడం నా లక్ష్యం. ఈ దిశగా ఎన్‌సీసీలో చేరాను. క్రమం తప్పకుండా సాధన చేస్తున్నా. సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదికగా ఎన్‌సీసీలో చేరాను. సీ సర్టిఫికెట్ నా ముందున్న లక్ష్యం.
- రఫీ, డిగ్రీ విద్యార్థి, పీలేరు

ఆర్మీలో చేరడమే ధ్యేయం



చిన్నప్పటి నుంచి ఆర్మీలో చేరి దేశం కోసం సేవ చేయాలన్నదే నా లక్ష్యం. డిగ్రీ మొదటి సంవత్సరంలోనే ఎన్‌సీసీలో చేరాను. ఆర్మీ తరహాలోనే ఇక్కడ కూడా శిక్షణ తరగతులు ఉంటాయి. ఇది పోలీసు ఎంపిక ప్రక్రియకు దోహదపడుతుందని నమ్మకం. - రెడ్డివిక్రమ్, సీనియర్ అండర్ ఆఫీసర్, పీలేరు

ఐపీఎస్ నా లక్ష్యం



తొలుగ ఎన్‌సీసీలో చేరగానే నాలో కొంత భయం నెలకొంది. రానురాను అలవాటుగా మారింది. భవిష్యత్తులో ఐపీఎస్ అవ్వాలని నా లక్ష్యం. ఈ దిశగా సాధన చేస్తున్నా. రాబోయే తరం విద్యార్థినులు ఎన్‌సీసీలో చేరి భవిష్యత్తుకు బాటలు వేసుకుందాం.
- మధులత, డిగ్రీ విద్యార్థి, పీలేరు

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ


మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ అధికారి చంద్రశేఖర్


చిన్నమండెం, న్యూస్‌టుడే: స్థానిక వెలుగు కార్యాలయ సభా భవనంలో మంగళవారం మండల మహిళా సమాఖ్య సభ్యులకు ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు ప్రారంభించారు. రైతు సాధికార సంస్థ అధికారులు చంద్రశేఖర్, సురేంద్రరెడ్డిలు శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయంలో మహిళా సమాఖ్య సభ్యుల భాగస్వామ్యం, సాగు చేసే విధానాలపై అవగాహన కల్పించారు. ఏపీఎం రెడ్డెమ్మ, వెలుగు, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో విద్యార్థినుల సత్తా

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ఓబులవారిపల్లె మండలం ఏపీఆర్ఎస్ సంజీవపురం పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఖోఖో ఎంపిక పోటీల్లో పట్టణానికి చెందిన రాయలసీమ అకాడమీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపారని కరస్పాండెంట్ శ్రావణి పేర్కొన్నారు. అండర్-14 విభాగంలో జరిగిన పోటీల్లో వి.మనోజ్ఞ, టి.ఆయేషాలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు.


విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


రైతులకు ఉలవలు పంపిణీ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, అధికారులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని.. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని కొత్తపల్లెలో మంగళవారం జిల్లా వ్యవసాయశాఖాధికారి చంద్రానాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ప్రతి మంగళ, గురువారాల్లో రెండు గ్రామాల్లో కార్యక్రమాలు చేసి రైతులకు సూచనలు ఇస్తారన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పంట నష్ట వివరాలను సకాలంలో ప్రభుత్వానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతానికి సాగు నీరందించే శ్రీనివాసపురం జలాశయానికి నీరు రావాలంటే రూ.110 కోట్ల మేర నిధులు అవసరమవుతాయని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.. వచ్చే రెండేళ్లలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం 80 శాతం రాయితీతో ఉలవలను రైతులకు అందజేశారు. ప్రకృతి వ్యవసాయ అధికారులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం బండపై నుంచి పడి మృతి చెందిన తొట్టివాండ్లపల్లెకు చెందిన జి.మల్లయ్య అంత్యక్రియల్లో మంత్రి పాల్గొన్నారు. జిల్లా ఉద్యానాధికారి రవిచంద్రబాబు, పశుసంవర్ధక శాఖ జేడీ గుణశేఖర్‌పిళ్లై, జిల్లా గృహనిర్మాణాధికారి సాంబశివయ్య, మాజీ సర్పంచి వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్తు స్తంభాలు... మృత్యుపాశాలు!

ప్రమాదకర స్థితిలో ఉన్నా పట్టించుకోని అధికారులు

ఇదీ రాజంపేట పట్టణంలో దుస్థితి

- న్యూస్‌టుడే, రాజంపేట

రాజంపేటలో విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఏళ్ల తరగబడి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నా పట్టించుకోవడం లేదు. పట్టణ వాసులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం శూన్యం. తమకు సంబంధం లేదని కాంట్రాక్టర్ చేయాలని చెబుతూ చేతులు దులుపుకొంటున్నారు. కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి పనులు చేయించాల్సిన అధికారులు మిన్నకుండిపోవడంతో అవస్థలు తప్పట్లేదు.


రాజంపేట పట్టణం ఉస్మాన్ నగర్‌లో చాలా కాలం నుంచి రోడ్డుపైకి విద్యుత్తు స్తంభం ఒరిగి దర్శనమిస్తోంది. మూడు నెలల కిందట పక్కన స్తంభం ఏర్పాటు చేసినా నేటి వరకు స్తంభానికి కనెక్షన్ ఇచ్చి పాత స్తంభాన్ని తొలగించలేదు. ఈ స్తంభం ఎదురుగానే ఓ ప్రైవేటు పాఠశాల ఉంది. విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.

వెంటనే మరమ్మతులు చేయిస్తాం : పట్టణంలో పలు చోట్ల ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను గుర్తిస్తాం. సిబ్బందితో సరి చేయించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. పది రోజుల్లో అన్ని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం. - సురేంద్ర, విద్యుత్తు ఏడీఈ, రాజంపేట


భవనానికి ప్రమాదకరంగా ఆనుకుని ఉన్న ఈ విద్యుత్తు స్తంభం రాజంపేట పట్టణం రాజీవ్‌నగర్‌లోనిది. స్తంభం బరువుతో భవనం ప్రహరీ కూడా దెబ్బతింది. విద్యుత్తు తీగలు సైతం భవనానికి ఆనుకుని ఉన్నాయి. ఈ విషయాన్ని అధికారులకు తెలిపినా ప్రయోజనం లేకపోయిందని బాధితులు వాపోతున్నారు.


ఈ స్తంభం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రమాదకర స్థితిలో ఉంది. ఇక్కడే సెలవు రోజుల్లో చిన్నారులు ఆడుకుంటూ ఉంటారు. మరో వైపు రోడ్డు ఉంది. విద్యుత్తు స్తంభం ఒరిగితే రోడ్డుపై వెళ్లే ప్రజలకు ప్రమాదం జరిగే వీలుంది.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


మాట్లాడుతున్న సీఐ రవిశేఖర్‌రెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చేసినా.. ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని మహిళా పోలీసు స్టేషన్ సీఐ రవిశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలిక విద్యను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. తల్లిదండ్రులు బాలిక సంరక్షణ బాధ్యతతో పాటు వారిని ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించిన, వ్యవహరించిన కఠిన చర్యలు ఉంటాయన్నారు. వివాహ వయస్సు, వరకట్న వేధింపులు, ర్యాగింగ్ నిరోధక చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళ ఎస్సై రమాదేవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాయితీ ఉలవలకు పేర్లు నమోదు చేసుకోవాలి

సుండుపల్లి : ప్రత్యామ్నాయ పంటల సాగు నిమిత్తం 80 శాతం రాయితీతో ఉలవలు ఇస్తామని ఏవో మహబూబ్‌బాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అవసరమున్న రైతులు తమ వివరాలను సచివాలయ పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో బుధవారం నుంచి తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

ఎంఈవోపై చర్యలకు డిమాండు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: అధికార దుర్వినియోగానికి పాల్పడిన నియోజకవర్గంలోని ఓ ఎంఈవో-1పై తక్షణమే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండు చేశారు. స్థానిక డైట్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆయన మాట్లాడుతూ... ఎంఈవో తన కార్యాలయంలో పని చేసే సిబ్బందిని ఆమె కార్లు తుడిచేందుకు వినియోగించుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు. గతంలో పదో తరగతి పరీక్షల్లో అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న

ఆర్‌ఆర్-5 కాలనీలో వసతుల కల్పనకు చర్యలు

ఓబులవారిపల్లె : మంగంపేటలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆర్‌ఆర్-5 కాలనీలో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఏపీఎండీసీ సీపీవో సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సభాభవనంలో మంగళవారం డేంజర్‌జోన్ బాధితులతో తహసీల్దారు పీరుమున్నీతో కలిసి సమావేశమయ్యారు. గ్రామంలో కనీస వసతులు ఉండాలని.. దేవాలయాలు ఏర్పాటు తమ అభిప్రాయం మేరకే జరగాలని బాధితులు కోరారు. కార్యక్రమంలో కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతీవాడ గ్రామస్థులు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మహేష్‌నాయుడు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

పెనగలూరు : కొండూరు పంచాయతీ తిరుణంపల్లి దళితవాడకు చెందిన పల్లాల చిన్నయ్య రేకుల షెడ్డును అదే గ్రామానికి చెందిన కొందరు ధ్వంసం చేశారని ఫిర్యాదు అందిందని ఎస్సై రవి ప్రకాష్‌రెడ్డి చెప్పారు. బాధితుడు చిన్నయ్య రేకుల షెడ్డును కూల్చడమే కాకుండా కులం పేరుతో దూషించారని బాధితుడి ఫిర్యాదుతో వెంకట సుబ్బయ్య నాయుడు, బుజ్జిరెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

జూదరుల అరెస్టు

చిన్నమండెం, న్యూస్‌టుడే: చిన్నమండెం సమీపంలో జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సుధాకర్ మంగళవారం తెలిపారు. వారి నుంచి రూ.13,820 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

ఇసుక ట్రాక్టరు జప్తు

వీరబల్లి, న్యూస్‌టుడే: తాటిగుంటపల్లి సమీపంలో ట్రాక్టర్‌తో ఇసుక అక్రమంగా రాయచోటికి తరలిస్తుండగా మంగళవారం సాయంత్రం జప్తు చేసినట్లు ఎస్సై మోహన్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు స్టేషన్‌కు తీసుకొచ్చి కేసు నమోదు చేసినట్లు వివరించారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. తనతో పాటు సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.

ప్రతి నీటి బొట్టు ప్రాణాధారమే


విద్యార్థినికి ప్రశంసా పత్రం, బహుమతి అందిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు

సంబేపల్లె(రాయచోటి), న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వంతో చదివినప్పుడే ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరాజు పేర్కొన్నారు. సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన 'నీటి సమస్యలు-పరిష్కారాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. భూమిపై ఉన్న సహజ వనరుల్లో నీరు ముఖ్యమైందన్నారు. ప్రతి నీటి బొట్టు ప్రాణాధారమేనన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. నీటి ప్రాముఖ్యంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులలో సామాజిక స్పృహను పెంచుతున్న ఏకలవ్య ఫౌండేషన్ సేవలను కొనియాడారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ రెడ్డిశేఖర్, హెచ్ఎం మడితాటి నరసింహారెడ్డి, హరినాథరాజు, తెదేపా నాయకులు మూడే జయరాం, అఖండ నాయక్, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, రీసోర్స్ టీచర్స్ రెడ్డెయ్యరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెను కరవు మండలంగా ప్రకటించాలి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా తీవ్ర కరవు ఛాయలు అలుముకున్నాయని.. లక్కిరెడ్డిపల్లె మండలాన్ని కరవు మండలంగా ప్రకటించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్ధిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని చౌటపల్లె గ్రామ పరిధిలో మంగళవారం రైతులు సాగు చేసిన వేరుసెనగ పంటలను ఆయన పరిశీలించారు. మండలంలో దాదాపు 1,926 ఎకరాల్లో వేరుసెనగ సాగులో ఉందని.. నీరందక పూర్తిగా ఎండిపోయే స్థితికి చేరాయన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంటల వివరాలు సేకరించి పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం ఇప్పించి రైతులను ఆదుకోవాలన్నారు. సీపీఐ నాయకులు, రైతులు పాల్గొన్నారు.


ఎండిపోయిన వేరుసెనగ పంటను పరిశీలిస్తున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు

ముగిసిన వ్యక్తిత్వ వికాస సదస్సు

రాజంపేట : స్థానిక అన్నమాచార్య యూనివర్సిటీలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న వ్యక్తిత్వ వికాస సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సినీనటుడు ప్రదీప్‌ను విద్యార్థులు ఉన్నతంగా ఎలా ఎదగాలి, వారి లక్ష్యాలు, ఆశయాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు ఆయన్ను సత్కరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

దళారుల మోసాలను అరికట్టాలి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: బొప్పాయి రైతులను నిలువునా దోచేస్తున్న దళారుల మోసాలను అరికట్టాలని జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ డిమాండు చేశారు. స్థానిక టోల్ గేట్ వద్ద మంగళవారం రైతులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాలలో టన్ను బొప్పాయి రూ.25 వేలు పలుకుతుండగా.. ఇక్కడ మాత్రం రూ.16 వేలతో కొనుగోలు చేసి ఇప్పుడు ఆ ధరను రూ.10 వేలకు తగ్గించారన్నారు. కొందరు దళారులు రైతులకు పెట్టుబడి ఖర్చులు, విత్తనాలు ఇచ్చి వారిని తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నారన్నారు. పంట చేతికి వచ్చిన తరువాత వారు చెప్పిన ధరలకే విక్రయించేలా చేస్తున్నారని.. ఇలాంటి పరిస్థితుల నుంచి ప్రభుత్వం రైతులను కాపాడాలని కోరారు. రైతు సంఘం నాయకులు ఆదినారాయణ, వెంకన్న, శ్రీనివాసులు, నరసింహారెడ్డి, సుబ్రహ్మణ్యం, ఖాసిం, ఖాదర్‌వలి పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు చంద్రశేఖర్

దివ్యాంగులకు ఉపకరణాలు

పుల్లంపేట, న్యూస్‌టుడే: అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తామని ఎంపీడీవో రఘురాం తెలిపారు. స్థానిక ఎస్‌బీవీడీ సభా ఉన్నత పాఠశాలలో మంగళవారం దివ్యాంగుల దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వంద మంది దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి త్వరలో ఉపకరణాలు అందజేస్తామన్నారు. దివ్యాంగుల జిల్లా పర్యవేక్షక అధికారి అనిల్, దివ్యాంగుల సంఘ నాయకుడు సుబ్బనరసారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి సేవాభావం అలవర్చుకోవాలి
ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



వీరబల్లిలో మాట్లాడుతున్న ప్రభుత్వ జూనియరు కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా


ర్యాలీ నిర్వహిస్తున్న అన్నమాచార్య కళాశాల విద్యార్థులు, సిబ్బంది

వీరబల్లి, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి సేవా భావాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా కోరారు. కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే (జాతీయ సేవా పథకం దినోత్సవం) సందర్భంగా మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవో రఘురామయ్య మాట్లాడుతూ.. సేవా దృక్పథం కలిగి స్వచ్ఛందంగా సేవా చేసే విద్యార్థులు వాలంటీర్లుగా చేరాలన్నారు. ఎన్ఎస్ఎస్-2 పీవో భాస్కర్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే అనేక రకాల వ్యాధులు దూరమవుతాయని ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీవెంకటేశ్వర కళాశాల నుంచి ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవా పథకం) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీవో కృష్ణారెడ్డి, అధ్యాపకులు సహదేవరెడ్డి, శాంతయ్య, సుందర్‌రావు పాల్గొన్నారు.

చిన్నమండెం: స్థానిక ఆదర్శ పాఠశాలలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రిన్సిపల్ రమేష్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త నాగనవీన్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వ్యక్తిత్వ వికాసం పొందేందుకు కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థుల మానసిక, శారీరక వికాసంతో పాటు సామాజిక సేవను చైతన్యం చేయడమే లక్ష్యమన్నారు. అనంతరం సేవా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు : రాజంపేట : రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీఎస్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభించారు. అనంతరం గుండ్లూరు వద్ద చెయ్యేరులో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. కార్యక్రమంలో సినీనటుడు కె.వి.ప్రదీప్, కళాశాల వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, స్టూడెంట్ ఎఫైర్ డీన్ డాక్టర్ ఎం.సుబ్బారావు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎల్.ఓబులపతి, ఎన్‌సీసీ ఇన్‌ఛార్జి దీప్తి, పీడీ డాక్టర్ బి.నాగముని పాల్గొన్నారు.

ఊటుకూరు అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న తెదేపా నాయకుడు సుగవాసి సుబ్రహ్మణ్యం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ఊటుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోని నాలుగు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని రాజంపేట నియోజకవర్గ తెదేపా నాయకుడు సుగవాసి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఊటుకూరు గ్రామ సచివాలయ ఆవరణంలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అండర్ డ్రైనేజీ కాలువలు, మంచి నీటి వసతి, రోడ్ల నిర్మాణాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గీతాంజలి రమణ, సుధాకర్ రెడ్డి, లక్ష్మీనరసయ్య, ఎంఎల్ నారాయణ, సుబ్బరాయుడు, గన్నే సుబ్బనరసయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేలిమి వంగడాలతో మంచి దిగుబడి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : రబీ సీజన్‌లో మేలిమి వంగడాలను రైతులు కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందొచ్చని వ్యవసాయాధికారి జి.వి.కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నరసన్నగారిపల్లె, చెంచుగారిపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి, పసుపు పంటలను పరిశీలించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఏవో మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఆర్ఎస్‌కేల బాధ్యులు చంద్రమోహన్, ప్రభాకర్‌రెడ్డి, పద్మజ, పశుసంవర్ధకశాఖ, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది రాణి, అన్నపూర్ణ, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఎయిడ్స్ బాధితులకు వైరల్, సీడీ4 పరీక్షలను నిర్వహించారు. వీరిలో రోగ నిరోధక శక్తి ఏమేరకు పెరిగిందనే దానిపై పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ శుభశ్రీ, డాక్టర్ అనూష తెలిపారు. 84 మందికి వైరల్ లోడ్ శాంపిల్స్, 44 మందికి సీడీ4 పరీక్షలు చేసినట్లు చెప్పారు. షేర్ ఇండియా ప్రాజెక్టు అధికారిణి మంజుల, కౌన్సిలర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


వైరల్, సీడీ4 పరీక్షల కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకే పొలం పిలుస్తోంది

సుండుపల్లి, న్యూస్‌టుడే: రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని దగ్గర చేసి వ్యవసాయం, అనుబంధ రంగాలను లాభసాటిగా మార్చడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ఉద్దేశమని ఏవో మహబూబ్‌బాషా పేర్కొన్నారు. సుండుపల్లిలో ఎంపీపీ ఎంపీపీ ఎం.రాజమ్మతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమ గోడపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం సమీపంలోని వరి పంటను పరిశీలించి రైతులతో చర్చించారు. ఖరీఫ్, రబీ కాలంలో ప్రతి మంగళవారం, బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి సేద్య సిబ్బందితో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.


సుండుపల్లి : పొలం పిలుస్తోంది గోడపత్రాలు విడుదల చేస్తున్న ఎంపీపీ రాజమ్మ, అధికారులు

ఓబులవారిపల్లె: కాకర్లవారిపల్లెలో రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఏవో మల్లిక, హెచ్‌వో భాస్కర్ వివరించారు. సర్పంచి వెంకటయ్య, వ్యవసాయ శాఖ సహాయకులు మధు, మహేష్, అశోక్ పాల్గొన్నారు.

వీరబల్లి: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెదేపా మండలాధ్యక్షుడు ఎం.భానుగోపాల్‌రాజు అన్నారు. వీరబల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమ కరపత్రాలను విడుదల చేశారు. ఆధునిక పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి శ్వేత పేర్కొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పంటలు సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రమేష్‌బాబు పేర్కొన్నారు. అనంతపురంలో రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.


ఓబులవారిపల్లె : కాకర్లవారిపల్లెలో బొప్పాయి తోటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు